క్లుప్తంగా

రాష్ట్రంలో కాపుల మద్దతు వైఎస్సార్ సీపీకే

రాష్ట్ర కాపు యువసేన అధ్యక్షుడు కర్ణా శ్రీనివాసరావు

శావల్యాపురం: స్వర్గీయ వంగవీటి మోహన రంగా హత్యలో ప్రధాన పాత్ర పోషించిన తెలుగుదేశం పార్టీకి కాపు వర్గీయులు కలలో కూడా ఓటు వేయరని రాష్ట్ర కాపు యువసేన అధ్యక్షుడు కర్ణా శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వంగవీటి మోహనరంగా హత్య జరిగే విషయం మాజీ మంత్రి హరిరామ జోగయ్యకు ముందుగానే తెలుసునని కేవలం మంత్రి పదవి కోసం విషయాన్ని బయటకు రాని వ్వకుండా చేసిన కులద్రోహి హరిరామజోగయ్య అన్నారు. కాపు రిజర్వేషన్ ఉద్యమం సమయంలో కాపు యువకుల మీద కేసులు పెట్టినప్పుడు నోరు మెదపని జనసేన అధినేత పవన్‌కల్యాణ్, హరిరామజోగయ్య లాంటి వారందరు నేడు కాపులకు అండగా ఉంటామని మాటలు చెప్పటం హాస్యాస్పదమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయంలో గతంలో కాపు యువకులపై పెట్టిన కేసులన్నీ ఎత్తేసిన విషయాన్ని కాపు వర్గీయులు మరిచిపోమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువనాయకులు మలిశెట్టి నరేష్, టి.రవిబాబు, వడ్రాణం నాగేశ్వరరావు, తోట ప్రసన్నాంజనేయులు, పుట్టా లక్ష్మి నారాయణ ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



విద్యార్థిని సంఘవిని అభినందిస్తున్న హెచ్‌ఎం విక్టోరియా

నరసరావుపేట రూరల్: స్కూల్‌గేమ్స్ రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ అమోస్ విక్టోరియా గురువారం తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో పాఠశాలలో 8వ తరగతి చదవుతున్న టి.సంఘవి షార్ట్‌పుట్, హ్యామర్‌త్రో విభాగాలలో ద్వితీయస్థానం సాధించి జిల్లా జట్టుకు ఎంపికైనట్టు తెలిపారు. శ్రీకాకుళంలో ఈనెల 19వ తేదీ నుంచి నిర్వహించే రాష్ట్రస్థాయి ఆటల పోటీలలో సంఘవి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తుందని వివరించారు. ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికైన సంఘవిని పాఠశాల పీఈటీ భారతీ, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ఆయుష్ వైద్యశిబిరం

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని ములకలూరు గ్రామంలో డాక్టర్ ఆర్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆయుష్ వైద్యశిబిరం గురువారం నిర్వహించారు. సీజన్ వ్యాధులు, మలేరియా, డెంగీ వ్యాధుల గురించి వైద్యులు శ్రీనివాస్ అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. అనంతరం వ్యాధి నిరోధక శక్తిని పెంచడానికి ఆయుష్ మందులను పంపిణీ చేశారు. వెంకటాచారి, శ్రీను, శేఖర్, రాము, కోటేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నాదెండ్ల: కాలిన గాయాలతో గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మహిళ మృతి చెందింది. ఎస్‌ఐ ఎ.భాస్కర్ తెలిపిన వివరాల మేరకు పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం గొరిజవోలు గ్రామానికి చెందిన సంగుల సమాధానం (48) వ్యవసాయ పనులు చేసుకుని జీవిస్తుంది. గత కొంతకాలంగా ఈమె అనారోగ్యంతో పాటూ మతిస్థిమితం కోల్పోయి బాధపడుతోంది. జనవరి 1వ తేదిన సాయంత్రం 8 గంటల సమయంలో ఇంటి ముందు కట్టెలపొయ్యితో నీళ్ల కాగబెడుతుండగా, చీరకు మంటలు అంటుకోవటంతో తీవ్ర గాయాలపాలైంది. 108 సాయంతో నరసరావుపేట ఏరియా ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. బుధవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈమెకు భర్త సంగీతరావు, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వేధింపుల భర్తపై కేసు నమోదు

నరసరావుపేట టౌన్: భార్యను అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అతని కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. అరండల్‌పేటకు చెందిన యన్నం కవితకు పూనూరు రమేష్ బాబుతో 15ఏళ్ల క్రితం వివాహం అయ్యింది. గత కొన్నేళ్లుగా అదనపు కట్నం కోసం భర్త అతని కుటుంబ సభ్యులు వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయ పండిత పరిషత్ 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను పల్నాడు జిల్లా అధ్యక్షుడు టి.సాంబయ్య, ఎంఈఓ ఆంజనేయులు ఆవిష్కరించారు. హెచ్‌ఎం బొడ్డుపల్లి శ్రీనివాసరావు, సంఘ ప్రధాన కార్యదర్శి జి.నాగమునియ్య, నాయకులు మొగల్ సునీల్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రతి ఇంటా ఆర్థికాభివృద్ధి

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- 32వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: ముఖ్యమంత్రి జగనన్న పాలనలో రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధివైపు అడుగులు వేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని 32 వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. మంత్రి ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరు వివరిస్తూ, ఏ ఇంటికి ఏ పథకం ద్వారా లబ్ధి చేకూరిందో వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కుటుంబం బాగుపడేలా సంక్షేమ పథకాలను కులం, ప్రాంతం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం అందజేస్తుందని వివరించారు. సామాజిక తనిఖీల ద్వారా లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి వారికి ఆయా పథకాలను అందజేస్తున్నదని వివరించారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా పెద్దఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. ప్రజల కష్టాలు తెలిసిన నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టమని పేర్కొన్నారు. వార్డు, గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అవినీతికి ఆస్కారం లేని విధంగా పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం ఎంతో భరోసా కల్పిస్తున్నదని వెల్లడించారు. మరోవైపు నాడు–నేడు వంటి కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు వేస్తున్నారని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వార్డు కౌన్సిలర్ బిట్రా రాజేంద్రప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ బొల్లెద్దు చిన్నా, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, నాయకులు కసనానాయక్, ప్రగడ రామకోటేశ్వరరావు, పాలడుగు శివపార్వతి, అవ్వారు అన్నపశెట్టి, ఊట్ల సాంబమూర్తి, ప్రగడ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ పరిధిలోని ఎనిమిదిమందికి రూ.13.16లక్షల విలువైన సీఎం ఆర్థిక సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గుండ్లకమ్మ వాగులో ప్రమాదవశాత్తు జారిపడి చనిపోయిన పట్టణంలోని పెద్దనాల్సా బజారుకు చెందిన షేక్ హీనా, ఆయేషా సిద్ధిక, మొహమ్మద్ ఫైజుల్లా ఖాన్‌ల కుటుంబాలు నిరుపేద కుటుంబాలు కావడంతో పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కృషితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి విషయాన్ని తెలియజేసి ఒక్కొక్కరికి రూ.2లక్షలు సీఎం ఆర్థిక సహాయనిధిని మంజూరు చేయించడం జరిగిందన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకున్న ఐదుగురికి సీఎం సహాయనిధి ద్వారా రూ.7.61లక్షల చెక్కులను పంపిణీ చేశామన్నారు. ఆరోగ్య శ్రీ లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక రకాల వ్యాధులను చేర్చడం జరిగిందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకొని చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్రాంతి అంటేనే రంగవల్లులు

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: పండుగలు సాంప్రదాయ ప్రతీకలని... సంక్రాంతి అంటేనే రంగవల్లులు గుర్తొస్తాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని ఆర్‌వీఎస్‌సీవీఎస్ హైస్కూల్ గ్రౌండ్‌లో వైఎస్సార్ సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు కందుల శ్రీకాంత్, సుబ్బయ్యతోట యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ పంటలు ఇంటికి వచ్చే వేళ జరుపుకొనే ఆనందాల పండుగ సంక్రాంతి ఎంతో విశిష్టమైనదని చెప్పారు. ముగ్గుల పోటీలలో మొదటి బహుమతి సాధించిన ఎం.పద్మావతికి రూ. 10వేలు నగదు బహుమతి, ద్వితీయ స్థానం సాధించిన వాణికి రూ. 7వేలు, తృతీయ స్థానం సాధించిన ఎం కీర్తికి రూ. 5వేలు నగదు బహుమతులు అందించారు. మరో నలుగురికి కన్సోలేషన్ బహుమతులు, పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందించారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, ఏఎంసీ మాజీ చైర్మన్ బొల్లెద్దు చిన్నా, బహుమతి ప్రదాతలు వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, 29వ వార్డు కౌన్సిలర్ షేక్ యూసుఫ్ ఆలి, పార్టీ యువ నాయకులు ఇక్కుర్తి పవన్, నాయకులు పాల్గొన్నారు.

మూడేళ్లలో రూ.2లక్షల కోట్ల సంక్షేమ ఫలాలు

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



వార్డు పర్యటనలో మహిళలతో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: రాష్ట్రంలోని పేద ప్రజలకు మూడున్నరేళ్లలో రూ.2లక్షల కోట్ల సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి ఎనిమిదవ వార్డు ఇస్లాంపేటలో రెండోరోజు పర్యటించారు. వార్డు మాజీ కౌన్సిలర్ షేక్ అబ్దుల్ సత్తార్, నాయకులు షేక్ కరిముల్లా, షేక్ ఖాజా, షేక్ రబ్బాని, సయ్యద్ ఫాతిమా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఇంటింటికి తిరుగుతూ ఇప్పటివరకు ప్రతి గృహానికి అందుతున్న సంక్షేమపథకాలను గురించి తెలియచేస్తూ వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను అందజేసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా, జగనన్న తోడు, వసతి దీవెనతో పాటుగా 27 పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. పట్టణంలో ఏ వార్డులో లేని విధంగా ఇస్లాంపేట వాసులకు 430మందికి ఇళ్లపట్టాలు అందించామన్నారు. మున్సిపల్ డీఈ ఒ.శ్రీనివాసరావు, ఏఈ స్వర్ణరాజు, మాజీ కౌన్సిలర్లు యర్రంశెట్టి బాబ్జి, మాగులూరి రమణారెడ్డి, బత్తుల లక్ష్మీపద్మలత, నాయకులు షేక్ మహబూబ్‌భాష, సయ్యద్ ఖాదర్‌బాష, బొగ్గరం మూర్తి, కరిష్మా, షేక్ సర్దార్, షేక్ బాజి, జుబేర్, మల్లెల అనీల, బండి వెంకటేశ్వరరెడ్డి, పాదిలే ఖాజా పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగింత

నరసరావుపేట టౌన్: తప్పిపోయిన బాలుడిని పోలీసులు సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించిన సంఘటన గురువారం పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిడుగురాళ్ల పట్టణానికి చెందిన ఎనిమిదేళ్ల బాలుడు మీసాల ప్రతాప్ అతని తల్లి అరుణతో నరసరావుపేటకు వచ్చాడు. ఆడుకుంటూ రామిరెడ్డిపేటకు వెళ్లి తప్పిపోయాడు. అక్కడ ఏడుస్తుండగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో వన్‌టౌన్ పోలీసులు బాలుడిని స్టేషన్‌కు తీసుకొచ్చారు. అతన్ని విచారించగా స్వగ్రామం పిడుగురాళ్ల అని తెలిపాడు. దీంతో అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. బాలుడు ఇచ్చిన చిరునామాలో గృహానికి వెళ్లి విషయాన్ని తెలియజేశారు. దీంతో కుటుంబ సభ్యులు స్టేషన్‌కు వచ్చి తమ కుమారుడిని తీసుకెళ్లారు.

ఫార్మశిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు బాధ్యతగా పనిచేయాలి

నరసరావుపేట: ఫార్మశిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు సక్రమంగా సమయపాలన పాటిస్తూ అన్ని రకాల ఉద్యోగ నిర్వహణను బాధ్యతలను నిర్వహిస్తూ జిల్లాను మంచి స్థాయిలో నిలపాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి. శోభారాణి కోరారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో డాక్టర్ శోభారాణి అధ్యక్షతన జిల్లాలో నూతనంగా నియమితులైన 12 మంది ఫార్మశిస్టులు, 17 మంది ల్యాబ్ టెక్నీషియన్లకు ఓరియంటేషన్ శిక్షణ క్యాంపు నిర్వహించారు. డెప్యూటీ జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్లు అన్ని రకాల రికార్డులను నిర్వహిస్తూ, ప్రభుత్వ వైద్యాధికారి సూచించిన అన్ని రకాల టెస్టులను నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఫార్మశిస్టులు వ్యాక్సిన్, మందుల నిర్వహణలను సకాలంలో పూర్తిచేస్తూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి కోరారు. డాక్టర్ హనుమకుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

యడ్లపాడు: మండలంలోని బోయపాలెం 16వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మైదవోలు గ్రామానికి చెందిన పల్లపు శివపోలయ్య (32) బైక్‌పై 16వ నంబర్‌జాతీయ రహదారి బోయపాలెం అండర్ పాస్ వంతెన మీదుగా రాంగ్‌రూట్లో ఇంటికి వచ్చే క్రమంలో ఎదురుగా వచ్చిన గుంటూరు ఆర్టీసీ బస్సు ఢీకొంది. సుమారు రాత్రి 11 గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో వాహనాలు రెండు పాక్షికంగా ధ్వంసం కావడంతో పాటు బైక్‌పై ఉన్న శివపోలయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి కోటి వీరయ్య ఫిర్యాదు మేరకు గురువారం పోస్టుమార్టం పూర్తిచేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇదిలాఉండగా, గతేడాది జనవరి 31న శివపోలయ్య భార్య గోవర్ధిని మృతి చెందింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

బొల్లాపల్లి: ఐసీడీఎస్ ఈపూరు ప్రాజెక్టు పరిధిలో బొల్లాపల్లి మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకురాలు పోస్టులను భర్తీకై అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని ప్రాజెక్టు సీడీపీఓ బి.అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యకర్త పోస్టుకు దరఖాస్తు చేసే అభ్యర్థి 10వ తరగతి, సహాయకురాలి పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, 2023 జులై 1 నాటికి 21 నుంచి 35 సంవత్సరాలు వయసు కలిగి ఉండాలన్నారు. ఖాళీల వివరాలు.. మండలంలోని గుట్లపల్లి మెయిన్ - 1 (బీసీ–ఎ), జయంతిరామాపురం -1 (ఓసీ), రేమిడిచర్ల మెయిన్ -1 (బీసీ–డి) అభ్యర్థులకు కేటాయించడమైందని తెలిపారు. అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులు దోమలగుండం తండా -1 (ఎస్టీ), లాలిపురం -1 (ఎస్టీ), రెడ్డిపాలెం -1 (ఓసీ), చక్రాయపాలెం -1(ఎస్టీ), చక్రాయపాలెం (రాజానాయక్‌తండా)- 1 (ఎస్టీ), పేరూరుపాడు (కేశవానిపేట తండా) -1 (ఎస్టీ) అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5గంటల లోపు ఈపూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.

ఈపూరు మండలంలో...

ఈపూరు: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఈపూరు మండలంలో ఖాళీగా ఉన్న అంగన్ వాడీ సహాయకురాలు పోస్టుల భర్తీ కోసం మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ బి.అరుణ తెలిపారు. చిట్టాపురం -1 (బీసీ–డీ), వైకే తండా- 1(ఎస్టీ),బొమ్మరాజుపల్లి -1 (ఓసీ), అగ్నిగుండాల బీసీ -1 (ఓసీ), కొండ్రముట్ల మెయిన్ -1 (ఓసీ) ఖాళీగా ఉన్నట్లు వివరించారు.

నరసరావుపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో...

నరసరావుపేట రూరల్: నరసరావుపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్త, అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి సీహెచ్ ఉమామహేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రొంపిచర్ల మండలంలోని అన్నవరప్పాడు గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్త (ఓసీ), పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్ మెయిన్(ఓసీ), రామానగర్(బీసీ–డి), నరసరావుపేట మండల పరిధిలోని గురవాయపాలెం-4(ఎస్‌సి), ఇక్కుర్రు-1(బీసీ–డి), ఇస్సప్పాలెం-2(బీసీ–బి), రొంపిచర్ల మండలంలోని వడ్లమూడివారిపాలెం(ఎస్‌టీ), ఆరేపల్లి-2(బీసీ–ఎ), అన్నవరప్పాడు మెయిన్(ఓసీ), నకరికల్లు మండలంలోని కండ్లకుంట-5(ఎస్‌టీ) కేంద్రంలో అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులను భర్తీ చేయనున్నట్టు తెలిపారు.

గుర్తుకొస్తున్నాయి...!

సంతగుడిపాడు జడ్పీలో సమావేశమైన 1993–94 బ్యాచ్ 'పది' విద్యార్థులు



పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు, నాటి ఉపాధ్యాయులు

రొంపిచర్ల: మండలంలో సంతగుడిపాడు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం 1993–94 బ్యాచ్ పదవతరగతి పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు తరగతి గదులలో ఉపాధ్యాయులతో గడిపిన మధురక్షణాలను నెమరు వేసుకున్నారు. 30 సంవత్సరాల తరువాత కలుసుకొన్న స్నేహితులు ఆనాటి జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకున్నారు. వారు కుటుంబ సభ్యులతో సహా హాజరై రోజంతా సరదాగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి ఉపాధ్యాయులు కందిమళ్ల మురళీధర్, రసూల్, మహబూబ్ సుభానీలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వట్టిజొన్నల రామకృష్ణారెడ్డి, కోమటి రామకృష్ణ, నలబోతు రాజశేఖర్, దోసకాయల పుల్లయ్య, పొన్నా లక్ష్మారెడ్డి, గాదంశెట్టి ఆదిబాబు, రామల ఉదయలక్ష్మీ, అచ్చుల విజయలక్ష్మి, ఆకుల కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు



భోగి మంటల వద్ద ఉపాధ్యాయులు, విద్యార్థినుల సందడి

నాదెండ్ల: గణపవరం చుండి రంగనాయకులు డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. భోగి మంటలతో ప్రారంభించి రంగవల్లుల పోటీలు, కబడ్డీ, టగ్ ఆఫ్ వార్, వక్తృత్వం, పాటల పోటీలు, నృత్య పోటీలు, మ్యూజికల్ చైర్స్ నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులు అందించారు. అధ్యాపకుల టగ్ ఆఫ్ వార్ పోటీలు ఆకట్టుకున్నాయి. రన్నర్స్, విన్నర్స్‌కు ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ చైతన్య బహుమతులు అందించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చుండి వేణుగోపాల్, కార్యదర్శి విజయసారథి, ఎన్‌సీసీ కో–ఆర్డినేటర్ రామకృష్ణ, పీడీ నాగేంద్ర, పాల్గొన్నారు. అదేవిధంగా గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి పండుగ వేడుకలు నిర్వహించారు. బాలికలకు ముగ్గుల పోటీలు, కోలాటం నిర్వహించారు. బాలురకు గాలిపటాలు పోటీలు నిర్వహించారు. అనంతరం సంక్రాంతి పండుగ విశిష్టత తెలిపేలా భోగి మంటలు వేశారు. గంగిరెద్దుల ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం టి.సత్యనారాయణ, పీఎంసీ చైర్మన్ సూరా శంకరరెడ్డి, వైస్ చైర్మన్ రసూల్‌బీ, పీడీ వేణుగోపాల్, పీఈటీ జాస్తి శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: మండల కేంద్రమైన యడ్లపాడులో సంక్రాంతి పురస్కరించుకుని పలు సాంస్కృతిక, ఆటల పోటీలను నిర్వహించారు. స్థానిక కంసాలిబావి సెంటర్లో బాలబాలికలకు వేర్వేరుగా ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కుండకొట్టుట, మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, ఉండమ్మా బొట్టుపెడతా విభాగాల్లో విజేతలకు సినీనటులు ముత్తవరపు పద్మారావు, ముత్తవరపు సురేష్‌బాబు, జరుగుల శంకరరావు బహుమతులను అందజేసి ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యక్రమాలను ముత్తవరపు భరద్వాజ్, పి.కృష్ణతేజ, ఎస్.జగదీష్, హేమంత్, ఎం.తరుణ్, ఆకాష్, నూతలపాటి కాళిదాసు పర్యవేక్షించారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తోట రాజేంద్రప్రసాద్



తోట రాజేంద్రప్రసాద్

చిలకలూరిపేట: చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల మేరకు కమిటీ గౌరవ చైర్మన్‌గా స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని వ్యవహరిస్తారు. చైర్మన్‌గా పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది తోట రాజేంద్రప్రసాద్, వైస్ చైర్మన్‌గా మానుకొండ శ్రీనివాస వీరారెడ్డి వ్యవహరిస్తారు. పాలక మండలి సభ్యులుగా మెట్టు రమాదేవి, కోయలమూడి అరుణ, జాష్టి పార్వతి, పమిడి శైలజ, గోరంట్ల బాపారావు, షేక్ గని, గుడికందుల వెంకటరత్నం, బండారు దాసు, దావల రత్నకుమారి, దేవరకొండ నాగేశ్వరరావు, సింగిరేసు పోలయ్య, పెరుమాళ్ల వెంకట సత్యనారాయణరావు, తోట గీతారాణి, గణపవరం పీఏసీహెచ్ అధ్యక్షుడు, డిస్ట్రిక్ట్ అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్, నరసరావుపేట అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చరల్, చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ వ్యవహరించనున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన తోట రాజేంద్రప్రసాద్ సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రెండు పర్యాయాలు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ తొలినాళ్లలో నరసరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీలో కలిసి ఉండేది. రాజేంద్రప్రసాద్ తండ్రి స్వర్గీయ తోట భరతుడు ఉమ్మడిగా ఉన్న నరసరావుపేట వ్యవసాయకమిటికి చైర్మన్‌గా 1977 నుంచి 1980 వరకు వ్యవహరించారు. ఆయన చైర్మన్‌గా ఉండగా నరసరావుపేట మార్కెట్ కమిటి నుంచి చిలకలూరిపేట మార్కెట్ కమిటీ స్వతంత్ర్యంగా ఏర్పడింది. అలా ఏర్పడిన కమిటీకి కూడా రెండో పర్యాయం చైర్మన్‌గా వ్యవహరించారు. తోట రాజేంద్రప్రసాద్ నియామకంపై వైఎస్సార్ సీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నూతన కార్యవర్గం త్వరలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

వెయ్యి గంగాళాలతో స్వామివారికి నివేదన



ఉత్సవ విగ్రహాలకు నివేదన సమర్పిస్తున్న భక్తులు, ఆలయ నిర్వాహకులు

వినుకొండ టౌన్: ధనుర్మాసం సందర్భంగా పట్టణంలోని శ్రీనివాస నగర్ నందు గల అలివేలుమంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సంక్రాంతి, ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా కూడార్తై ఉత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రధాన అర్చకుడు శ్రావణ కుమార్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడు, గోదాదేవి మూర్తులకు 108 గంగాళాలతో పాయసం, 108 గంగాళాల వెన్నతో నివేదన కార్యక్రమం, ఉత్సవ మూర్తులకు ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మహిళలు స్వామి వారికి వేయి గంగాళాలతో నివేదన అర్పించారు. ఆలయ నిర్వాహకులు రెడ్డి బంగారయ్య, అచ్యుత కృష్ణ, సుబ్బారావు, కాళ్ల రామ కోటేశ్వరరావు, గుడిపాటి కోటేశ్వరరావు, మోటమర్రి నరసింహారావు, ననిశెట్టి వెంకట సుబ్రహ్మణ్య అప్పారావు పాల్గొన్నారు.

వివేకానందుడు యువతకు స్ఫూర్తి



చిలకలూరిపేట శాఖా గ్రంథాలయంలో స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు జడ్పీ హైస్కూల్‌లో జాతీయ యువజన దినోత్సవం వేడుకలు గురువారం నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం అధ్యక్షతన తొలుత వివేకానందుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వివేకానందుని బోధనలను విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయురాలు లావణ్య, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఎం.గుర్నాథం, మాజీ సర్పంచి కె.లక్ష్మీనారాయణ, మోటివేషనల్ స్పీకర్ జీవీ సుబ్బయ్య పాల్గొన్నారు.

ఈపూరు: స్థానిక ఈపూరు శాఖా గ్రంథాలయంలో స్వామి వివేకానంద 160వ జయంతి ఉత్సవాల (జాతీయ యువ దినోత్సవం)ను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి గ్రంథాలయ అధికారి జి.శ్రీనివాసరావు, విద్యార్థులు పూలమాల వేసి నివాలులర్పించారు. అనంతరం గ్రంథాలయంలోని స్వామి వివేకానంద పుస్తకాలను ప్రదర్శించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వినుకొండ(నూజెండ్ల): స్వామి వివేకానంద జయంతి వేడుకలను స్థానిక మెయిన్ బజారులో ఘనంగా నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కొప్పురావూరి అనిల్, ఇమ్మడిశెట్టి మల్లికార్జున, గోనుగుంట్ల రాజేష్, వీఎల్‌పీ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

యడ్లపాడు: ఎంత కాలం జీవించామన్నది కాదు... ఎలా జీవించామన్నదే ముఖ్యమని ఉపాధ్యాయుడు దేసు సురేష్ చెప్పారు. యడ్లపాడు శాఖ గ్రంథాలయంలో స్వామి వివేకనంద 160వ జయంతి వేడుకల్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన వివేకనందస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేసు అమరేశ్వరరావు, జి.శివరామకృష్ణయ్య, ఎం.వెంకటగిరి, జీఎల్ రావు, ఎం.సుబ్బారావు ఉన్నారు.

చిలకలూరిపేటటౌన్: నేటి యువత వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని ప్రముఖ సాహితీ విమర్శకుడు డాక్టర్ పీవీ సుబ్బారావు చెప్పారు. గురువారం పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో స్వామి వివేకానందుడి జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో యువత ఆదర్శవంతంగా, ఆత్మస్థైర్యంలో మెలగాని వివేకానందుడు సూచించారని వివరించారు. వివేకానందుడు భారత సంస్కృతిని దశదిశలా చాటిన మహోన్నతుడు అని కొనియడారు. ముందుగా వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జి నాగుల్‌మీరావలి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి దార్ల బుజ్జిబాబు, సహాయ కార్యదర్శి ఎ.గురులింగం, గ్రంథాలయ సిబ్బంది వీరరాజు, సరోజిని, సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.